జన జీవనం అస్తవ్యస్తం

- ఆగస్టు నెలలో వరద ప్రభావం
- ఎడతెరపి లేని వర్షాలతో దెబ్బతిన్న వ్యాపారాలు
- సెలవులతో సాగుతున్న చదువులు
- నెలన్నర రోజులుగా ప్రకృతి విపత్తులు



అంగరలో వర్షంలోనూ వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



వెదురుమూడిలో మూతపడిన ఇటుక బట్టీలు

కపిలేశ్వరపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా నెలన్నర కాలం పాటు కొనసాగిన వర్షాలు, వరదలతో జన జీవనం స్తంభించింది. ఆగస్టు, సెప్టెంబర్‌లలో వరదలు రావడం సహజమే. ఈసారి వెంట వెంటనే వరద, వర్షాలు రావడంతో అన్నివర్గాల ప్రజలూ ఇబ్బంది పడ్డారు. అందునా శ్రామికవర్గం సమస్యలతో సతమతమవుతోంది. విద్య, వ్యవసాయం, భవన నిర్మాణం, ఇటుక బట్టీ రంగాలు దెబ్బ తిన్నాయి. ఆయా రంగాలపై ఆధారపడి జీవిస్తున్న వారు సమస్యల్లో చిక్కుకున్నారు.

వరుస వర్షాలు...

ఆగస్టులో దాదాపు ఐదు రోజులు మాత్రమే ఎండ కాసింది. మిగిలిన రోజులన్నీ ముసాబులోనే గడిచాయి. ఏదొక ప్రాంతంలో ఏదొక సమయంలో చినుకులు పడుతూనే ఉన్నాయి. 29, 30 తేదీల్లో ఒక మోస్తరు, 31న భారీ వర్షాలు కురిశాయి. మిగిలిన రోజులు ముసురుతో జనజీవనం స్తంభించింది. ఈ నెల 4న కుండ పోత వర్షంతో గ్రామాల శివారు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. శని, ఆది, సోమవారాలు వర్షాలు పడడంతో నివాసిత ప్రాంతాలు చిత్తడిగా మారాయి.

సెలవులతో సాగుతున్న చదువులు

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోని విద్యా సంస్థలకు అధికంగా సెలవులు ఉన్నాయి. వరుసగా రెండు నుంచి మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. దీనికి తోడు వరద ఉధృతి నేపథ్యంలో ఆగస్టులో జిల్లా కలెక్టర్ ఆదేశాలపై విద్యాలయాలకు సెలవులు ప్రకటించారు. దీంతో కొద్ది రోజుల పాటు చదువులకు ఆటంకం కలిగింది. సెప్టెంబర్‌లో 8 సెలవులున్నాయి. 7న చవితి సెలవు కాగా మరుసటి రోజైన 8వ తేదీ ఆదివారం రావడంతో వరుస సెలవులొచ్చాయి. 14న రెండో శనివారం కాగా 15న ఆదివారం 16న మిలాద్-ఉన్-నబీ పండుగ కావడంతో మూడు రోజుల పాటు వరుస సెలవులు రానున్నాయి. ఆగస్టులో 4న ఆదివారం కాగా 10న రెండో శనివారం, 11వతేదీ ఆదివారం కావడంతో రెండు రోజులు వరుస సెలవులొచ్చాయి. 15న స్వాతంత్ర దినోత్సవం, 18 ఆదివారం, 25 ఆదివారం 26న శ్రీకృష్ణాష్టమి సెలవులిచ్చారు.

ఇప్పటికి పర్వాలేదు...కొనసాగితే నష్టమే...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 120 గ్రామాల్లో 1,01,785 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. దమ్ములు సమయం నుంచి నేటి వరకూ వర్ష ప్రభావం ఉంటూనే వచ్చింది. వెద జల్లిన సమయంలో వరద, వర్షాలు ప్రభావానికి పంట చేలు ముంపుబారిన పడడంతో రైతులు తీవ్ర అవస్థ పడ్డారు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది.

జ్వరాలతో సతమతం

రెండు నియోజకవర్గాల్లో 13 పీహెచ్‌సీలు, ఐదు అర్బన్ పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి పరిధిలోని 120 గ్రామాల్లో జ్వర పీడితులు పెరిగారు. దీంతో ఆయా ఆసుపత్రులను రోజుకు పదుల సంఖ్యలో రోగులు చేరుతున్నారు.


ఇటుక కొనేవారు లేరు



భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటుక విక్రయాలు నిలిచిపోయాయి. పెరిగిన ధరలకు అసలే వ్యాపారం లేదంటే వాతావరణ సైతం ఇబ్బంది పెడుతుంది.

–పోలిశెట్టి గణేశ్, ఇటుక బట్టీ నిర్వాహకుడు, కేదారిలంక

వరద భయం వెంటాడుతోంది



పదే పదే వస్తున్న వరదతో కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాల ప్రజలు భయాందోళన పడుతున్నారు. బయట పనులకు వెళ్లే పరిస్థితి సైతం లేదు. ఉద్యాన పంటలు ముంపుబారిన పడ్డాయి.

–యర్రంశెట్టి నాగేశ్వరరావు, కేదారిలంక

పారిశుధ్య కార్మికులపై పనిభారం



వరుస వర్షాలు, వరదల ప్రభావాలతో గ్రామాలు చిత్తడిగా మారాయి. ఆగస్టు నెలంతా పారిశుధ్య కార్మికులపై పని భారం పడింది. వర్షంతో వ్యర్థాలు డ్రెయిన్లలోకి ప్రవహించడంతో ఒక పక్కన వర్షం కురుస్తున్నా కార్మికులు పని చేస్తున్నారు.

– కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి, మండపేట

బయట పనులు లేవు



ముసాబుతో బయట పనులు లేకుండా పోయాయి. ఇప్పటికే స్లాబు నిర్మాణాలు పూర్తయిన చోట ప్లాస్టింగ్, కప్‌బోర్డు నిర్మాణ పనులు వంటివి చేయించుకుంటున్నారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, కపిలేశ్వరపురం గ్రామాల్లో విస్తారంగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వరుస వర్షాలతో వారంతా తీవ్ర సమస్యలు పడుతున్నారు.

–మేడేపల్లి కనక రామకృష్ణ, తాపీ మేస్త్రి, అంగర

వరుస సెలవులతో సమస్యలు



అవసరం మేరకు సెలవు ఇవ్వడంలో శాస్త్రీయతను అందరూ అంగీకరించాల్సిందే. అయితే పదే పదే అందునా వరుసగా సెలవులు రావడం విద్యార్జన ప్రక్రియ క్రమం తప్పి సమస్యను తెచ్చిపెడుతోంది. తిరిగి యథాస్థితికి తీసుకు రావడంలో విద్యా సంస్థలు, ఉపాధ్యాయులు నేర్పుతో వ్యవహరించాల్సి వస్తుంది.

–శ్రీకృష్ణ, ఉపాధ్యాయుడు, రామచంద్రపురం

వ్యాపారం మందగించింది



ఆగస్టు నెలంతా వర్షాలు కురిశాయి. నాలుగైదు రోజులు మినహా మిగిలిన రోజులన్నీ కనీసంగానైనా చినుకులు పడ్డాయి. దీంతో జనం బయటకు వచ్చే పరిస్థితి లేక వ్యాపారం మందగించింది. పొరుగూరు నుంచి వచ్చి దుస్తులు కొనేవారు కరవయ్యారు.

–చీకట్ల శ్రీనివాస్, వస్త్ర వ్యాపారి, అంగర

క్లుప్తంగా

గర్భిణుల సహాయకులకు అవగాహన అవసరం



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సహాయకులకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా అంగర పీహెచ్‌సీలో సోమవారం 24 మంది గర్భిణులను పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. వారిలో ఇద్దరు హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన వైద్య పరీక్షలకు నివేదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోషక విలువలున్న ఆహారంపై ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి అవగాహన కల్పించారు. శిబిరంలో వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

సూర్యప్రకాశ్ పరామర్శ



అముజూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామానికి చెందిన కడలి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ నాయకులతో కలసి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు, నాయకులు పంపన సుబ్బారావు, నానాపురపు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్, పెంకే రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై జాగ్రత్తలు అవసరం

కాజులూరు: వరి పంటపై తెగుళ్ల విజృంభణకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో సోమవారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం డెల్టాలోని వరి పొలాల స్థితిగతులు, వాటికి సోకే తెగుళ్లపై పలు సూచనలు చేశారు. మండల గ్రామాల్లోని వరి పొలాలు దుబ్బుకట్టే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నాయన్నారు. ఈ దశలోనే మాగుడు తెగులు, దోమ, ఆకునల్లి, ఆకుముడత వంటి తెగుళ్లు ఎక్కువగా వ్యాపిస్తాయన్నారు. రైతులు తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అరుణ

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాంబాబు దంపతులు సోమవారం జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాలను కలసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో ప్రధాన సమస్యలుగా ఉన్న మార్కెట్ అభివృద్ధి, ఆక్రమణలు, డంపింగ్ యార్డు సమస్యలను కలెక్టర్‌కు వారు వివరించారు.

వీఆర్‌లోకి ఎస్సై వాసు

రామచంద్రపురం: చార్జ్ తీసుకున్న 9 రోజులకే పట్టణ ఎస్సై పి.వాసు వీఆర్‌లోకి వెళ్లారు. ఈనెల 1న రామచంద్రపురం పట్టణ ఎస్సైగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ అధిష్టానానికి చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై వాసును వీఆర్‌లోకి పంపిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

నేడు మండపేటలో సామాజిక తనిఖీ వేదిక

మండపేట: మండల స్థాయి ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి సోమవారం తెలిపారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధి పనుల రికార్డులను తనిఖీ చేస్తామన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులపై సమీక్ష జరుపుతామని ఎంపీడీవో తెలిపారు.

పాఠశాలపై మమకారం..ఎన్‌ఆర్ఐ సాంకేతిక సాయం

ఆరు ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్ అందజేసిన పూర్వ విద్యార్థి



సత్తి ప్రతాప్‌రెడ్డి

రాయవరం: విదేశాల్లో స్థిరపడిన మండలంలోని పసలపూడికి చెందిన సత్తి ప్రతాప్‌రెడ్డి తాను చదువుకున్న స్వగ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు భారీ సాయం చేశారు. వివరాలిలా ఉన్నాయి. పసలపూడికి చెందిన సత్తి ప్రతాప్‌రెడ్డి ఆ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–85 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివాడు. అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో స్థిరపడ్డాడు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థుల సాంకేతిక విద్యకు ఊతమిచ్చేందుకు రూ.5 లక్షలు విలువైన ఆరు ల్యాప్‌టాప్‌లు, ఒక ప్రింటర్‌ను తన బ్యాచ్ పూర్వ విద్యార్థుల ద్వారా పాఠశాల హెచ్‌ఎం నూలు ఆదినారాయణకు అందజేశాడు. ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్‌తో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను హెచ్‌ఎం ఆదినారాయణ సోమవారం అదే బ్యాచ్‌కు చెందిన అప్పటి ఎస్‌పీఎల్ సత్తి వీర్రాఘవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. సత్తి ప్రతాపరెడ్డికి ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతా తాతారెడ్డి, మల్లిడి సాయిబాబారెడ్డి, కుక్కల శ్రీనివాసరావులతో పాటు 1984 –89 బ్యాచ్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు.



పసలపూడి జెడ్పీ హైస్కూల్లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభంలో హెచ్ఎం ఆదినారాయణ, పూర్వ విద్యార్థులు

సోమేశ్వరంలో ప్రధానమంత్రి జన్‌మన్ భేటీ



సోమేశ్వరంలో నిర్వహించిన ప్రధానమంత్రి జన్‌మన్ యోజన సమావేశం

రాయవరం: గిరిజన సంక్షేమంలో భాగంగా మండలంలోని సోమేశ్వరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో ప్రభుత్వం గుర్తించిన రెండు గిరిజన కుటుంబాలు (కొండ రెడ్లు)కు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అందరికీ పక్కా ఇళ్లు, మంచి నీటి కుళాయి, రహదారుల నిర్మాణం, విద్యుత్, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, అందరికీ పౌష్టికాహారం, జీవనోపాదులు, ప్రచార సాధనాల సౌకర్యాలను మెరుగుపరచడం, ఉచిత రేషన్ (ఆహార సరుకులు) ఉచిత వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్, గర్భిణులకు ఆర్థిక సహాయం, పాలిచ్చే తల్లులకు పోషకాహారం, ఆస్పత్రిలో ప్రసవాలు, టీబీ నిర్మూలన తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్య, ఎంఈఓ పి.రామలక్ష్మణమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ రామనారాయణ, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.చైతన్యకుమారి, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, డ్వాక్రా ఏపీఎం నాజర్, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం



పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: సాధారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు చేరవేస్తారు. అలాగే వారికి అవసరమైన ఆహారం, మంచి నీరు అందేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఆరోగ్య సాయం అందేలా మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటారు. కానీ ప్రస్తుత విజయవాడ వరదల నేపథ్యంలో వాతావరణ శాఖ, నీటి పారుదల శాఖలు ముందుస్తు హెచ్చరికలు చేసినా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా తన ఇంటిని కాపాడుకునే ప్రయత్నం మాత్రమే చేశారు. సీఎం తీరు చూస్తే కెమెరాలు పెట్టుకుని తామేదో ప్రజలకు చాలా సాయం చేసినట్టు ఫొటోలు, వీడియోలు తీయించుకుని మీడియాలోను, సోషల్ మీడియాలోను ప్రచారంపై పెట్టిన శ్రద్ధ ప్రజల బాగోగులపై లేదన్నది అందరికీ అర్థమవుతోంది. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రపంచం అంతా ఎదుర్కొన్న విపత్తు కరోనా సమయంలో వైఎస్సార్ సీపీ అధినేత, అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అన్ని ప్రభుత్వ యంత్రాంగాలను సమన్వయం చేసుకుని ప్రజలకు అండగా నిలిచిన సంగతి అందరికీ తెలిసిందే.

చినుకు పడితే చెరువే..



కోలంక గ్రామంలో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడి చెరువులా మారడంతో వాహనాలు వెళ్లేందుకు వీల్లేకుండా ఉన్న పరిస్థితి

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో కోలంక వద్ద రోడ్డు మధ్యలేర్పడిన గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. పల్లిపాలెం ముఖద్వారం నుంచి స్థానిక బోసుబొమ్మ సెంటర్ వరకూ సుమారు పావు కిలోమీటరు పొడవున రోడ్డు పల్లంగా ఉండటంతో చినుకు పడితే చెరువులా మారిపోతుంది. రోడ్డు పొడవునా తారు కరిగిపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వర్షాలు వీడిన వారం, పది రోజుల వరకూ ఇక్కడ నీరు నిలిచిపోతుంది. ఫలితంగా సైకిళ్ళు, బైక్ వంటి వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల పాలతున్నారు. ఆటో, ట్యాక్సీ వంటి వాహనాలు సైతం గోతులు దాటి వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

15 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో మండపేట రూరల్ పోలీసులు

మండపేట: మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లి వద్ద సోమవారం సారా తరలిస్తున్న మారిశెట్టి వీరవెంకట సత్యనారాయణ అనే వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 15 లీటర్ల సారాను, సారా తరలిస్తున్న సీబీజడ్ బైక్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. మండపేట రూరల్ ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మారిశెట్టి వీరవెంకట సత్యనారాయణ రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామం నుంచి సారాను తెచ్చి మండపేట మండలంలోని వివిధ గ్రామాల్లో చాటుగా విక్రయిస్తుంటాడు. పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం అతడి వాహనంపై ఉన్న సంచిని తనిఖీ చేయగా 15 లీటర్ల సారా బ్యాగులు బయట పడ్డాయి. నిందితున్ని రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండు విధించినట్టు సీఐ తెలిపారు. .

నిండు శోకంతో బీబీ సకీనా వర్ధంతి



ద్రాక్షారామలో గుర్రంపై ఊరేగిస్తున్న బీబీ సకీనా పీరు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో సోమవారం ముస్లింల ఆరాధ్య దైవం ఇమాం హుస్సేన్ కుమార్తె 'బీబీ సకీనా' వర్ధంతిని ముస్లింలు నిండు శోకంతో నిర్వహించుకున్నారు. స్థానిక బీబీ సకీనా పంజాలో ముంబై నుంచి విచ్చేసిన మత గురువు మౌలనా సాహెబ్ హసన్, మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్‌లు బీబీ సకీనా చెరసాలలో పడిన కష్టాలను మజ్లిస్‌ల రూపంలో వివరించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన కవులు సయ్యద్ రెహాన్ హైదర్ షాదాబ్, నఖీ అలీ బేగ్ జౌన్‌లు బీబీ సకీనా గేయాన్ని ఆలపించారు. సాయంత్రం పీర్(బీబీ సకీనా అలం)ను గుర్రంపై ఉంచి బీబీ సకీనా పంజా నుంచి పెద్ద మసీదు సెంటర్‌లోని 4 వ ప్రవక్త జైనుల్ అబేది పంజా వరకు మాతం చేస్తూ ఊరేగించారు. ఇతర రాష్ట్రాల నుంచి చుట్టుపక్కల జిల్లాల నుంచి ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమన్ సంఘాలు, ధర్మకర్తలు భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

కోలాహలంగా గణేశ్ ఉత్సవాలు



బస్‌స్టాండు వద్ద కోలాటం ఆడుతున్న బాలికలు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోను, మండలంలోని వివిధ గ్రామాల్లోనూ ప్రతిష్ఠించిన గణనాథులు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నారు. మంటపాలు, చలువ పందిళ్లలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలను భక్తితో కొలుస్తున్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని మంటపాల వద్ద రాత్రిపూట వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక 26వ వార్డు గాంధీనగర్ వీధిలో కొలువుదీరిన లక్ష్మీ గణపతి స్వామి వారు విశేష పూజలు అందుకున్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. డ్రాగన్ యూత్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి విశేష అర్చనలు చేశారు. బస్‌స్టాండు వద్ద గల గణనాథుడికి పల్లీల వీధి, తర్వాణీపేట వీధుల మహిళలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నీలం దుర్గమ్మ, అయినవిల్లి నరేష్, బిళ్లకుర్తి అంజి, కాయల సతీష్‌గౌడ్, కాయల సాయిబాబా, కాయల చంద్రశేఖర్, కాయల రమేష్, రేలంగి మహేష్, రావూరి ప్రసాద్, నున్న అంజిబాబు, పిల్లా వీరబాబు, పోలబోతు గణేశ్, గౌహర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సత్కారం



గర్భిణులను సత్కరిస్తున్న జై శ్రీరామ్ సేవా సంస్థ సభ్యులు

రామచంద్రపురం రూరల్: పామర్రు పీహెచ్‌సీ పరిధిలోని యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, తామరపల్లి, ఊడుమూడి, సుందరపల్లి, కూళ్ల, మల్లవరం తదితర గ్రామాలకు చెందిన 76 మంది గర్భిణులకు జై శ్రీరామ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించి దాతలు సమకూర్చిన నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, పౌష్టికాహారాలు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, జై శ్రీరామ్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత కంటి శుక్లం చికిత్సా శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామంలో మంగళవారం నుంచి ఈ నెల 16 వరకూ వారం రోజుల పాటు ఉచిత కంటి శుక్లం చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సోమవారం నిర్వాహకులు తెలిపారు. బులుసు కనకదుర్గ, వెంకట సత్య సుబ్రహ్మణ్యశర్మ జ్ఞాపకార్థం లంకా విజయ, మెహర్ చంద్, బులుసు, భమ్మిడిపాటి కుటుంబ సభ్యులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో చెన్నైకు చెందిన శంకర నేత్రాలయం కంటి వైద్యశాల నిపుణులు చికిత్స అందిస్తారన్నారు. గ్రామశివారు చిన కోరుమిల్లిలోని సీతారామ కాపు కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరంలో సేవలందిస్తారన్నారు. శిబిరంలో సేవలు పొందగోరువారు 8997384164, 7095175251, 8008106566 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.